# శారద నవ్వింది

శారదానది ప్రవహిస్తోంది గలగలా. ఆ నది అంటే నాకెంతో ఇష్టమూ, ఆరాధనా. ఆ పేరు వింటూంటే ఏదో ఏదో నాలో సన్నని పులకింత. శారదానది వొడ్డునవున్న గ్రామంలో ఓ పెంకుటింటి సావడిలో తడికల చాటున జన్మించానట నేను.

నా బాల్యం అంతా, ఈ నదిని చూస్తూ, ఈ నీరు త్రాగుతూ, ఇక్కడి చల్లని గాలి పీలుస్తూ ఈ నదిలో వేసవి సాయంత్రాలు ఈతలు కొడుతూ గడిచిపోయింది.

ఈ ఊరు వదిలి పాతిక సంవత్సరాలు దాటిందేమో! ఎంత మారిపోయింది.

"ఆస్తులుపోయి, ఇల్లుపోయి, ఈ ఊళ్ళో 'నా' అనేది యేమీ మిగలకపోయినా ఎందుకో నాకు ఈ గ్రామం, శారద

నది అంటే మమత. పాత మిత్రులు ఒకటి రెండు రోజులు ఆశ్రయమివ్వకపోరు అనే నమ్మకంతో, ఈ ఊరు వచ్చాను.

రవి పడమటి కొండల చాటున క్రుంగిపోతున్నాడు. రాత్రి ఎవ్వరి యింటో తలదాచుకోను! రేపు యీ నదిలో స్నానంచేసి ఈశ్వర దర్శనం చేసుకోవాలని వుంది.

కాని రాత్రి యెక్కడ వుండాలి? ఎందుకు వచ్చావని కొందరు ప్రశ్నిస్తే. ఎందుకు వచ్చావన్నట్లు కనులతోనే ప్రశ్నించారు మరికొందరు మిత్రులు. అందరూ నావైపు, బట్టలవైపు చిత్రంగా చూసేవారే! హైస్కూలు వచ్చింది, రోడ్లు పడ్డాయి, బస్సులు నడుస్తున్నాయి. కాని ఇంకా ఊరి ప్రజ నాగరికులు కాలేదు.

సన్యాసిసెట్టి నాకెంతో మిత్రుడు బాల్యంలో. అంటే ఒకటవ తరగతి మొదలు ఎనిమిదవ తరగతి పూర్తి అయ్యే వరకూ కలసి చదివాం. మా మధ్య ఎప్పుడూ అభిప్రాయ భేదాలు రాలేదు. చిలిపి తగువన్నా వచ్చినట్లు నాకు గుర్తు లేదు. ముందుగా అతడి ఇంటికే వెళ్ళాను. వీధిలో కిరాణా దుకాణం. బెల్లం, ఉప్పు మూట, ఇంకా పేకేజ్ డొక్కులలో పప్పులూ, బియ్యాలూ. కాటా ముందు కూర్చున్నాడు సన్యాసిసెట్టి. బెల్లంమీద ఈగలు ముసురుకుంటున్నాయి. చచ్చిన ఈగలు, చీమలు బెల్లపు గుండలో కలిసిపోయాయి. బెల్లం ముక్క కాటాలో తూచి కాస్త గుండ కూడా సేస్తు

న్నాడు సెట్టి. "ఆ గుండెత్తావేటి సెట్టీ నాయిడబ్బులు కావా? ముక్కోటి టియ్!' అంటుంది ఓ ముసలిది.

"కొంటే కొను లేకపోతే మానెయ్, నీవి డబ్బులయితే యిది బెల్లంకాదా. ఇదేటి సేత్తాం!" అన్నాడు సెట్టి కాయితంలో తూచిన బెల్లం పంచుతూ.

"అరిసెలొండుకో' అని ఆమె గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

నాకు నచ్చింది. ఆ పెదవులు విచ్చుకున్నాయి. అప్పుడే వెళ్తున్న ముసలిదానివైపు కోపంగా చూసి "ఈసారి అరువట్టి కెల్దుగానిరా" అంటున్న సెట్టి అప్రయత్నంగా నా వైపు చూశాడు.

"ఎవరండి బాబు? ఎవరికోసం?" అతడడిగాడు, ఆ గొంతులో కొండంత విజయం.

నేను "శర్మను గుర్తుపట్టలేదూ?" అన్నాను నవ్వుతూ.

"ఓ. నువ్వా! ఎందుకు వచ్చావురా! ఎవరింటికి వచ్చావూ?" అని లేచి నిల్చున్నాడు సెట్టి.

నీ ఇంటికే అనబోయి, "ఉత్తినే, ఎవరింటికీ కాదు, మిమ్మల్ని, పాత మిత్రుల్ని, చూడాలనిపించి" అన్నాను తడబాటుగా.

"రా, లోపలికిరా, అయ్యా!" అని కొడుకుని పిల్చి "దుకాణం సూస్తుండు, ఇప్పుడే వస్తాను" అని పదిహేనేళ్ళ వయసున్న కొడుక్కి దుకాణం వప్పగించి లోపలికి నడిచాడు.

ఆ ఉప్పుమూట, బెల్లపుదిమ్మ, పేకేజీ దొక్కులూ దాటుకుంటూ సెట్టి వెనుక లోపలికి నడిచాను.

నాకో కుర్చీ వేసి, కూర్చోమని తానోక బల్లమీద కూర్చుని, "ఏటి కబుర్లు? "ఏటి సేస్తున్నావిప్పుడు? ఉద్యోగమా?" అడిగాడు సెట్టి.

చెప్పాను వివరాలన్నీ రెండు నిమిషాల్లో.

"ఎంతతిస్తారు జీతం?" అడిగాడు.

"ఆరువందలు" అన్నాను.

"ప్చ్. చాలవే ఈ రోజుల్లో" అని "వరలక్ష్మీ" అని ఒడ్డుగొంతుతో భార్యని పిల్చాడు. 'ఏడి గొంతు ఇంత ఒడ్డుగా ఎప్పుడు మారిపోయిందో?' ఆశ్చర్యమనిపించింది నాకు.

వళ్లుగా నిగ నిగ లాడుతూ ఎర్రని ముతకచీర కట్టుకున్న ఒకామె ఇవతలికి వచ్చి, "ఎందుకు పిల్చారు?" అని అడగబో యింది కాబోలు. ఆమె విడిన నోరు వస్తున్న మాటగానే వెంటనే వెంటనే ముడుచుకుంది.

"కాఫీ సేసి పట్రా!" అర్డరు వేశాడు సెట్టి ఆమెను చూసి.

నాతో ఏదో మాట్లాడుతున్నాడేకాని ఆ అయిదారు నిమిషాలు సెట్టి దృష్టి అంతా దుకాణంమీదే ఉంది. "ఒరే అగ్గయ్య! అరువివ్వక, పాతనోట్లుచ్చుకోక. తూకాల బేరం వుంటే నన్ను విలువ" అని ఏదో అరుస్తూనే వున్నాడు. నాకు కూర్చోవడం ఇబ్బందిగా వుంది.

తళ తళ మెరుస్తున్న రెండు వెండి గ్లాసులలో కాఫీ తెచ్చింది వరలక్ష్మి.

తక్కువ పౌడరు, ఎక్కువ పాలూ, పంచదారా. కాఫీలా లేదు. పానకంలా వుంది. ఎలానో సగం మింగి, "మరి

వెళ్తాను. మిమ్మల్నీ, ఈ ఊర్నీ ఎంతయినా పుట్టిపెరిగిన ఊరు కదా! చూసి పోదామని వచ్చాను" అని లేచి నిల్చున్నాను.

"ఆ వెళ్ళు" అని నవ్వుతూ తానూ లేచి హడావుడిగా మళ్ళీ తన సీటులో దుకాణం మీద కూర్చున్నాడు.

సెట్టికి వృత్తిమీద ఎంత శ్రద్ధ! సెట్టికీ నాకూ యెంత వ్యత్యాసం? ఆఫీసరు సెలవు ఇవ్వనన్నాడు. సిక్ లీవు పెట్టి వచ్చేశాను నేను. సెలవు లేదు. జీతం కోసేస్తారు. ఐనా లక్ష్య పెట్టలేదు.

సిమ్మినాయుడు తనతో ఆరవతరగతి వరకూ చదివాడు, తోటలో జామకాయలూ, తాటికాయలూ, కొబ్బరి కాయలూ మామిడికాయలు అన్నీ ఇచ్చేవాడు నాకు. వాణ్ణి చూద్దామని నాయుడుగారి యిళ్ళవైపు నడిచాను.

"సిమ్మినాయుడున్నాడా?" అడిగాను ఇంటిలో వాళ్ళని.

"పొలాని కెళ్ళాడండి!" అన్నారు అందరూ ఒకేసారి.

'సరే' అని వెనుదిరిగి సిమ్మినాయుడి పొలంవైపు నడిచాను.

ఇదివరకు కాలిబాట ఇప్పుడుకంకరరోడ్డు. ఊరుకి మైలున్నర దూరంలో ఉంది సిమ్మినాయుడి పొలం. సెట్టి పోసిన తియ్యటి నీళ్ళే. పన్నెండు దాటిందేమో ఆకలి రగులుకుంటూంది. ఊళ్ళో నాలుగయిదు కాఫీపాకహోటళ్ళు కనుపించాయి. సిలవర్ పళ్ళేల్లో ఇడ్లీలు, ఈగలు ముసురుతూ కనుపించాయి. కాని తినాలనిపించలేదు. అసహ్యమనిపించింది.

నాయుడు పంచెపైకి యెగ్గట్టి ఏం చేస్తున్నాడో పొలం గట్టున నిల్చున్నాడు. ఇహ నడవలేనివాడిలా పొలం దగ్గర

వున్న పాకముందు కుక్కి మంచం మీద చతికిలబడి కూర్చొని వెనుదిరిగి నిల్చున్నది సిమ్మినాయుడవునో కాదో అనగా నిర్ధారించుకోకపోయినా పిల్చాను గట్టిగా "సిమ్మినాయుడూ!" అని.

చటుక్కున వెనుదిరిగి సూటిగా నా వైపే చూశాడు నాయుడు నన్ను గుర్తుపట్టాడో లేదో, యెవరనుకున్నాడో మాట్లాడకుండా నేనున్న వైపు నడిచి వస్తున్నాడు.

ఇతని ఆతిథ్యమెలా ఉంటుందో అని నవ్వుకున్నాను.

"ఓ, మీరుటండీ!" అని సంతోషంగా నన్ను చూసినందుకు కాబోలు నవ్వి, నా పక్కనే కూర్చుంటూ, "ఎప్పుడు వచ్చారు? ఈ ఊళ్ళో మీ కెవరన్నా బంధువులున్నారా? మన వూరు చాలా మారిందిలెండి, హైస్కూలు వచ్చింది. రైవాడ దగ్గర ప్రాజెక్టు కడుతున్నారు కదా. ఏటి ఒడ్డున క్వార్టర్స్, అందులో ఆఫీసర్లు. ఊళ్లోంచే వచ్చారు కదూ! ఎండనపడి వచ్చారు. అసలు యెప్పుడు వచ్చారు!" గలగల మాట్లాడేడు.

అతను యెప్పుడూ నన్ను 'మీరు' అనే మన్నించేవాడు. పూర్వం బ్రాహ్మణులు, రాజులు అనగానే పిల్లల్ని కూడా అన్నతో సంబోధించేవారు. అందులో మాది పల్లెటూరు కదా!

మళ్ళీ పాత ప్రశ్న, పాత జవాబు తర్వాత, నా వివరాలు - సంభాషణ అయింది.

ఇంత అతనితో ఏం మాట్లాడాలో మళ్ళీ యెక్కడికి వెళ్లాలో తోచలేదు నాకు. ఎండ నెత్తి మాడుస్తోంది. తగ్గాక 'శారద' నీ చూసి ఆఖరి బస్సులో వెళ్ళిపోదామనుకున్నాను.

తాటికాయలు కొట్టించి 'తినండీ' అన్నాడు నాయుడు. కడుపుపట్టినన్ని తినేశాను.

ఇంతలో నాయుడి పెళ్ళాం కాబోలు - తట్ట నెత్తిన పెట్టుకొని ఆ పాక దగ్గరకు వచ్చింది. ఆమె రవిక తొడుక్కోలేదు. నన్ను చూసి బిడియంగా వంగి పాకలోకివెళ్ళిపోయింది. ఆమెను అనుసరించి లోపలికి నడిచాడు నాయుడు. లోపలి నుంచి ఏమేమో వారిద్దరూ గుస గుసా నెమ్మదిగా మాట్లానుకునే మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

మంచం తలవైపున గడ్డికూరి వున్న గోనెసంచీ మీద తలపెట్టుకొని కళ్లు మూసుకున్నాను. ఎప్పుడు నిద్రపట్టిందో, సాయంత్రం నాలుగు గంటలకు మెలకువ వచ్చింది.

ఇంటికి వెళ్ళిపోవటానికి కాబోలు పంచె సరిగా కట్టుకొని లాల్చీ తొడుక్కొని చింత చెట్టుక్రింద నిల్చుని వున్నాడు నాయుడు.

లేచి నిల్చుని ప్యాంటుజేబులో వున్న దువ్వెన తీసి తల దువ్వుకుంటూ "వెళ్తాను నాయుడూ! నువ్వూ, వూరిలోకి వస్తున్నావా?" అని అడిగాను.

"పదండి" అన్నాడు నాయుడు.

చల్లని నీళ్ళతో ముఖం కడుక్కొని కొబ్బరినీళ్ళు త్రాగితే బాగుండుననిపించింది. నాయుడు వెళ్ళటానికి తొందరపడుతున్నట్లు అప్పుడే రోడ్డెక్కేస్తే ఇంకేం అడగను?

ఒకటి రెండు మాటలు దోవలో నాకూ, నాయుడికీ మధ్య దొర్లాయి.

ఊళ్ళోకి రాగానే 'వస్తాను' అని చెప్పి నాలుగు గజాలు ముందుకి నడిచిన నాకు నదికి వెళ్ళే తోవవైపు క్వార్టర్సు కనిపించాయి.

నెమ్మదిగా నది ఒడ్డుకు వెళ్ళి కూర్చున్నాను.

* * *

"బాబుగోరూ ఏమిటిలా వచ్చారు!" బొంగురుగొంతు విని, చివాలున తలతిప్పి చూశాను.

తలపాగా, నెత్తిన గడ్డిబుంగ, చేతిలో కొడవలీ, మాసిన గోచీ, చినుగుల చొక్కా— ఎర్రిగాడిని గుర్తుపట్టాను.

"ఏరా! ఎర్రిగా బాగున్నావా!" అన్నాను నవ్వుతూ. వాడ్ని చూస్తూనే నాలో సంతోషం, ఓ రకమైన పశ్చాత్తాపం, జాలీ ఒకేసారి తొణికిస లాడాయి.

ఎర్రిగాడు మా ఇంట్లో ఓ నాటి పాలేరు. నూతి నీళ్లు కావిడతో తెచ్చిపోయటం, గేదెకి గడ్డి తేవటం, పేడలు తియ్యటం, మాకు పక్కలు పరవటం, కిరసనాయులు లాంతర్లు తుడవటం మేము చెప్పే ప్రతిపనీ చేసే వాడు. వాడి తండ్రి కట్టెలకని కొండకి వెళ్ళితే పులి యెత్తుకుపోయింది. తల్లి జబ్బుతో మరణించింది. తాత దగ్గర ఉండేవాడు. వాడికి జీతం సంవత్సరానికోసారి గింజలు కొల్చే వాళ్ళు. ఏమిటో నేను వాడిమీద యెక్కువ అజమాయిషీ చేసే వాడ్ని. నేనంటే భయపడేవాడు. రాత్రిళ్లు వాణ్ణి కాళ్లు పట్టమనేవాణ్ణి 'కాదు' అనేవాడు కాదు.

బుంగ దించుకొని నాపక్కన చతికిలబడి కూర్చుంటూ, "మిమ్మల్ని జన్మలో సూత్తాననుకోనేదండి! ఎందుకు బాబూ

వచ్చారు ఈ వూరు? ఏటో మునుపటి మనుషులూ కారు, మునుపటి వూరూ కాదు" అని నిట్టూర్చాడు ఎర్రిగాడు.

"నిన్ను చూడాలని వచ్చాన్రా" అని నవ్వి, "పెళ్ళి చేసుకున్నావా? పిల్లలా? ఏమిటి చేస్తున్నావు?" అని అడిగిన నా ప్రశ్నకు కదిలికదిలి నవ్వాడు. ఆతర్వాత "నాకు పెళ్ళేటండీ! నాను మొగోణ్ణి కానంట. మా తాత సచ్చిపోయాడు. నన్ను అందరూ ఒగ్గేశారు. నా వాటాకి మిద్దె వచ్చింది. అందులో ఉంటాను. ఇదిగో యీ బుంగ అమ్మితే రూపాయి వత్తది. ఓపికవుంటే బియ్యప్పుగింజలు కొని మరగబోసుకుంటాను. నే పోతే సత్తెలమ్మ కొట్టుదగ్గర అట్లు తిని, టీ తాగి, పడుకుంటాను, మీ రెక్కడ వుంటున్నారు? ఉద్యోగమా?" అడిగాడు ఎర్రిగాడు.

ఉద్యోగం, ఊరు, నా జీతం, ఈ రావటానికి అయ్యే టికెట్టు ఖర్చు చెప్పి, "నిజంగా ఈ ఊరు తెలిసిన వ్యక్తుల్ని చూడాలని వచ్చానురా ఎర్రిగా!" అన్నాను.

"సదువుకున్నోరుగాని, మీ కేం తెలుసండి అంతడబ్బు ఖర్చెట్టుకు రావటానికేటుందండి ఈ ఊర్లో!...మీరు అన్నెట్టి ఆదరించే ఒకడనా ఉన్నాడేటండీ!" అని ప్రశ్నించి, వెంటనే నాలుక కరచుకొని, "దానికేటి నా నిప్పిత్తానుండండి. సత్తెలమ్మ కొట్టుదగ్గర కాఫీ, టిఫిను, అది కాదు" అని ఆగిపోయాడు. ఆ పైని ఏం మాట్లాడాలో తోచలేదు కాబోలు.

డబ్బు ఖర్చు సంగతి ఇప్పుడే తట్టింది. నా స్నేహితుడికి జబ్బుగా వుందనీ, విశాఖ హాస్పిటల్లో వున్నాడనీ. చూసి వస్తాననీ, మా ఆవిడతో అబద్ధం చెప్పి ఈ వూరు వచ్చాను.

ఈ ఖర్చు, ఈ లోటు బడ్జెట్ సర్దుకునేసరికి నాలుగునెలలవా
వుతుంది.

"నిజమే! ఖర్చే అనుకో. కానిడబ్బు ఖర్చు కాని
నువ్వు. ఈ నది ఎలా కనిపిస్తారు చెప్పు!" అన్నాను నవ్వుతూ

పడమటి కొండల చాటున ఒరిగిపోయాడు రవి. ఎ
గాడు యెటో యేటి అలలవైపు మౌనంగా చూస్తున్నా
చీకట్లు ముసురుకుంటున్నాయి.

"ఇందరా ఎర్రీ!" అని పర్సులోని రెండు రూపాయ
కాయితం వాడి చేతిలో పెట్టాను.

కృతజ్ఞతతో మరేమిటో వాడి కనురెప్పలు నీటితో
తడిశాయి. "బాబూ!" అన్నాడు గద్గద స్వరంతో.

"పద పోదాం" అని లేచి నడిచాను. రాత్రి ఉండాలని
పించలేదు మరి.

బుంగ నెత్తికి యెత్తుకొని ఆ వెంట నడిచా
ఎర్రిగాడు,

"వరదొస్తుంది బాబు! కొండల్లో వర్షం కురిసిం
గావాల! గబగబా నడవండి" అన్నాడు ఎర్రిగాడు.

వరద వస్తుందనో, నేను వచ్చాననో, గలగలా నవ్వు
తున్నట్లు ప్రవహిస్తుంది శారద. వాచీ చూసుకొని గబగబ
అడుగులు వేశాను బస్‌స్టాండ్ వైపు.

—:o:—

ST. JOSEPH'S GIRLS HIGH SCHOOL,
GUNTUR.